
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

జిల్లా వార్తలు

5

మంగళవారం 26 నవంబరు 2024

28న జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 28న జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోశాధికారి ఆర్ వెంకటేశ్వర్‌రావు, కె శంకర్, జి. అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సెయింట్ జార్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ టెస్టుకు మండల స్థాయిలో ఎంపికైన 8,9,10 తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఒక జట్టుగా హాజరుకావాలని సూచించారు. వివరాలకు జి అశోక్‌ను 9490300725 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ శాఖలో ఆర్టిజన్లను పర్మినెంట్ చేయాలి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యుత్ ఆర్టిజన్లు

భగత్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లను వెంటనే పర్మినెంట్ చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ నాయకులు కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టిజన్లను విద్యుత్‌సంస్థలో విలీనం చేసినమాట మరిచారా అని ప్రశ్నించారు. ఆర్టిజన్లతో వెట్టి చాకిరి చేయిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కొత్త ఫ్యాక్టరీ చట్టం 1946 స్టాండింగ్ సర్వీస్ రూల్స్‌ను విద్యుత్ సంస్థ తెరపైకి తెచ్చి ఆర్టిజన్లను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మార్చడం ఎంత వరకు సమంజసమన్నారు. ఆర్టిజన్ల విద్యార్హతల మేరకు రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ ఇవ్వాలని, లేకపోతే ఆర్టిజన్లతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

● ఆశావర్కర్లను ఆదుకోండి

తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశా) వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఆశా వర్కర్లు కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందించారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాన్ని అమలుచేసి, హెల్త్‌కార్డులు ఇప్పించాలని కోరారు. ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రజియాబేగం, దోసపాటి సరిత పాల్గొన్నారు.

'ఉపాధి' జాతర

- ప్రజాపాలన విజయోత్సవాల్లో పనులు ప్రారంభం
- జిల్లాకు రూ. 33 కోట్లు
- 21 రకాల పనులు చేపట్టేందుకు ప్రణాళిక



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల జాతర నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబరు 1 నుంచి 9వరకు జరిగే ప్రజాపాలన విజయోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఉపాధి హామీ జాతరను నిర్వహించి ఇందులో చేపట్టిన పనులను వచ్చే మార్చి 31లోగా పూర్తి చేయనున్నారు. ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా, పొలంబాట, వన మహోత్సవం, జలనిధి, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకాల కింద ఆయా గ్రామాల్లో అవసరమైన పనులు ఈ జాతరలో భాగంగా చేపడతారు. ఇందుకోసం మండలాలవారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి ఆయా మండలాలకు అవసరమైన నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 15 గ్రామీణ మండలాల్లో సుమారు 33 కోట్ల రూపాయల విలువైన పనులను చేపట్టనున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద కూలీలు చేసే పనులపై వెచ్చించిన ఖర్చుపై 40 శాతం సొమ్మును మెటీరియల్ కాంపోనెంట్‌గా ఇస్తారు. ఇప్పటివరకు ఈ కాంపోనెంట్ కింద 39.08 కోట్లు సమకూరాయి. వెచ్చించినవి పోను మరో 33 కోట్లు ఉన్నాయి. వీటిని ఉపాధిహామి జాతర పనులపై వెచ్చిస్తారు.



ఉపాధి జాతరలో భాగంగా కరీంనగర్ రూరల్ మండలంలో ప్రారంభించనున్న యూనిట్ ను పరిశీలిస్తున్న సిబ్బంది

● మెటీరియల్ కాంపోనెంట్ కింద సమకూరే నిధులతో..

ప్రతి సంవత్సరం మెటీరియల్ కాంపోనెంట్ కింద సమకూరే నిధులతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో పనులు చేపట్టి ఆఘమేఘాలపై పనులు పూర్తి చేస్తారు. ఈ సంవత్సరం అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తుగానే పనులు చేపట్టాలని భావించారు. దానికి అనుగుణంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించాలని

మిగతా 8వ పేజీలో...

● జిల్లాలో 1.24 లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలో 1.24 లక్షల జాబ్‌కార్డులుండగా 2.32 లక్షల కూలీలు పనికోసం నమోదుచేసుకున్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఈ పథకం కింద 71.15 కోట్లు వెచ్చించారు. ఇందులో కూలీలకు చెల్లించిన మొత్తం 58.63 కోట్లు కాగా, మెటీరియల్ పనుల కోసం 8.83 కోట్లు, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 3.67 కోట్లు వెచ్చించారు. మెటీరియల్ కాంపోనెంట్‌గా 39.08 కోట్లు సమకూరగా ఇప్పటి వరకు వెచ్చించిన సొమ్ము 8.83 కోట్లు కాగా ఇంకా వినియోగించుకోవడానికి మిగిలిన నిధులు 30.25 కోట్లు ఉన్నాయి. వచ్చే మార్చి నాటికి ఉపాధి జాతర పనులు పూర్తి చేయాల్సి ఉంది. అప్పటి వరకు మరికొన్ని కోట్ల రూపాయలు మెటీరియల్ కాంపోనెంట్‌గా వచ్చే అవకాశముండడంతో 33 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జాతర పనులను చేపడుతున్నారు.

'డీవైఎస్‌వోను సస్పెండ్ చేయాలి'

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆర్చరీ అకాడమికి ఉచితంగా అంబేద్కర్ స్టేడియంలో స్థలం కేటాయించిని డీవైఎస్‌వోను సస్పెండ్ చేయాలని ఏబీఎఫ్‌బీ జిల్లా ప్రధానకార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం వెనకగల నాలుగు గుంటల స్థలాన్ని ఆర్చరీ అకాడమీకి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. నగరంలోని వివిధ కోచింగ్ సెంటర్ల నుంచి ముడుపులు తీసుకుని అంబేద్కర్ స్టేడియంను వారికి వినియోగానికి ఇస్తున్నారని ఆరోపించారు. ఏ కోచింగ్ సెంటర్ ఎంత ఫీజు కట్టిందో డీవైఎస్‌వో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలన్నింటిపై అధికారులు విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

ప్రజావాణికి 193 దరఖాస్తులు

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 193 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఖజానా ఖాళీ చేసింది..

అయినా కష్టపడి పనిచేస్తున్నాం..

- మహారాష్ట్రలో బీజేపీ గెలిచిందని సంతోష పడుతున్నారా..?
- టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి మహారాష్ట్రలో ఎందుకు పోటీ చేయలేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్



హుజూరాబాద్‌లో మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుజూరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులందరం కలిసి సంక్షేమం, అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గూడూరి రాజేశ్వరి-స్వామిరెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు త్వరలోనే రైతు భరోసా, పేదవారికి రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్కా నీరు రాకుండానే ప్రకృతి సహకారంతో ఎల్లంపల్లి నుంచి నీళ్లు పొదుపుగా వాడుకొని ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో రైతులు ఎక్కువ ధాన్యం పండించారన్నారు. మొన్నటి వరకు ధాన్యం కొనుగోళ్లలో డీఫాల్ట్ మిల్లర్లు.. బీఆర్ఎస్ నాయకులు కలిసి రాజకీయం చేసి ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నించారన్నారు. గతంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసేందుకు నాలుగు విడతలు పట్టిందని, పది నెలల్లోనే 18 వేల కోట్ల రుణాలు మాఫీ చేసి చరిత్ర సృష్టించామన్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి వందల కార్లలో మహారాష్ట్రకు పోయి, మొన్నటి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయ లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని సంతోష పడుతున్నారా..? కాంగ్రెస్ ఓడిందని సంతోషమా హరీశ్‌రావు చెప్పాలన్నారు. రైతులకు ఏకకాలంలో రూ. 18వేల కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ రైతును రాజుగా చూస్తుందన్నారు.

గతంలో ఓడిపోయిన గెల్లు శ్రీనివాస్ హుజూరాబాద్ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంచినందుకే తాను కూడా పంచుతున్నానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. రెండ్రోజుల క్రితం కేటీఆర్, హరీశ్‌రావు ఎమ్మెల్యేగా ఓడిపోయిన ప్రణవ్ చెక్కులు ఎలా పంచుతారని సోషల్ మీడియాలో ప్రశ్నించారన్నారు. గతంలో వాళ్లు చేసిందే ఇప్పుడు తాను చేస్తున్నానన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, సుగుణాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, పత్తి కృష్ణారెడ్డి, తోట రాజేంద్రప్రసాద్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాంపల్లి తిరుపతి, బండారి సదానందం, మంద సమ్మిరెడ్డి, దుబాసి బాబు, చాంద్‌పాషా పాల్గొన్నారు.

● రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేస్తున్నాం..

శంకరపట్నం: కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్నరకం వడ్లకు మద్దతు ధరతోపాటు బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం శంకరపట్నం మండలం తాడికల్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ప్రభాకర్ రైతులతో మాట్లాడారు. రైతు భరోసాతో పాటు త్వరలోనే రుణమాఫీ కానీ రైతులకు రెండు లక్షల రుణమాఫీ జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య, హుజూరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

అధ్వానంగా మధ్యాహ్న భోజనం

● అన్నం తినలేమంటూ విద్యార్థుల ఆందోళనలు

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రోజురోజుకు అధ్వానంగా మారుతోదంటూ విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, డీఈవో కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. సోమవారం మధ్యాహ్న భోజనం కోసం వండిన అన్నం చూసి విద్యార్థులు ఈ అన్నం మేము తిన లేమంటూ ఆందోళనకు దిగారు. అన్నం సరిగా ఉడకక పోవడం, అడుగంటడంతో ఆ అన్నం తింటే అనారోగ్యానికి గురవుతామని, అన్నం తినేందుకు విద్యార్థులు నిరాకరించారు. ఇలాంటి భోజనం ఎందుకు పెడుతున్నారంటూ పాఠశాలలో ఆందోళన చేశారు. ప్రభుత్వం పంపిస్తున్న బియ్యంతో అన్నం వండి భోజనంగా పెడుతున్నామని, ఇందులో తమ తప్పేమి లేదంటూ అటు ఉపాధ్యాయులు, ఇటు మధ్యాహ్న భోజన కార్మికులు చెబుతున్నారు. కొంత కాలంగా వస్తున్న బియ్యంతో అన్నం వండితే గిన్నెలో పైభాగంలో ఉడకడం లేదని, కింది భాగం అడుగంటుతుందని మధ్యాహ్న భోజన నిర్వాహకులు చెబుతున్నారు.



కరీంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో మెత్తగా మారిన అన్నాన్ని చూపుతున్న విద్యార్థులు

గురుకులాలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

భగత్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ గురుకులాలపై రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి విమర్శించారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాటాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా హామీల అమలు చేసేలేదన్నారు. స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, ఇంటింటికి ఇంటర్నెట్, ఐదు లక్షల భరోసా కార్డు ఇప్పటికి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, మామిడిపల్లి హేమంత్, సందీప్‌రెడ్డి, సాయికృష్ణ, వినయ్‌రెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

'అర్హతలేని వైద్యులపై చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల్లో అర్హతలేని వారు వైద్యం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో అర్హతలేని వైద్యులు సూపర్ స్పెషాలిటీ పేరుతో ఆసుపత్రులను ప్రారంభించి వైద్యులుగా చెలామని అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇలాంటివారిపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత శాఖ అధికారులు విఫలమయ్యారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నేషనల్ మెడికల్ కమిషన్ యాక్ట్-2019, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రూల్స్-2013, టీఎంపీఆర్ యాక్ట్-1968 ప్రకారం అర్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మెడికల్ కౌన్సిల్ స్పష్టం చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎన్ఎంసీ-2013, 2019లో సెక్షన్ 34 రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ కాకుండా ఇతరులు ప్రాక్టీస్ చేయడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించినవారికి జైలు శిక్షతోపాటు ఐదు లక్షల రూపాయల జరిమానా విధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార ఆలోచనతో అర్హతలేని వారు ఆసుపత్రులను నెలకొల్పి ప్రజలను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం



కేక్ కట్ చేస్తున్న పాస్టరేట్ చైర్మన్ పాల్ కోమాలు, పాల్గొన్న క్రైస్తవులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు చర్చ్‌లలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని వెస్లి కెథడ్రిల్ చర్చ్‌లో క్రిస్మస్ జ్యోతిని పాస్టరేట్ చైర్మన్ పాల్ కోమాలు వెలిగించి వేడుకలను ప్రారంభించి కేక్ కట్ చేశారు. అసిస్టెంట్ పాస్టర్ మధుమోహన్ సందేశమిచ్చారు. క్వాయర్ బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. క్రీస్తు జనన వృత్తాంతంతో కూడిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వారసంత.. ప్రజలకు చింత

- అందుబాటులోకి రాక ప్రజలు, చిరువ్యాపారులకు ఇబ్బందులు
- మహాత్మానగర్‌లో నిరుపయోగంగా నిర్మాణాలు
- పట్టించుకోని పాలకులు

-తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి 6

రైతులంతా కదిలారు.. 'కల్వల' గండి పూడుస్తున్నారు

-శంకరపట్నం, ఆంధ్రజ్యోతి 6

పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలి

- హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

-సుభాష్‌నగర్, ఆంధ్రజ్యోతి 7

సమగ్ర సర్వే కోసం కార్పొరేషన్‌లో కాల్‌సెంటర్

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వే నగరంలో తుది దశకు చేరింది. ఈ నేపథ్యంలో ఎక్కడైనా ఇళ్లకు స్టిక్కర్లు వేయకుండా వదిలిపెట్టినా, ఇళ్లలోని కుటుంబాల వివరాలు ఇప్పటికీ సేకరించని వారు వారి సమాచారాన్ని తీసుకునేందుకు నగరపాలక సంస్థలో ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. కాల్‌సెంటర్ నంబర్ 98499-06694కు ఫోన్ చేసి వివరాలను తెలియజేవచ్చని, నేరుగానైనా నగరపాలక సంస్థలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో వివరాలు నమోదు చేయించుకోవచ్చని కమిషనర్ చాహత్‌బాజ్‌పాయి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ సమాచారాన్ని సంబంధిత ఏరియా ఎన్యూమరేటర్, సూపర్‌వైజర్లు తీసుకుంటారని, ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఝాన్సీరోడ్డులో తాళం వేసి ఉన్న ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన కొండబత్తిని గంగాకిషన్ - అరుణ దంపతులు ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. సోమవారం ఇంటి తలు పులు తెరిచి ఉండడంతో చుట్టు పక్కల వారు గమనించి గంగా కిషన్‌కు ఫోన్ ద్వారా విషయం చేరవేసారు. గంగాకిషన్ సూచన మేరకు బంధువులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ సురేష్ బాబు తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. పోలీసులు క్లూజ్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. గంగాకిషన్‌ను ఫోన్‌లో సంప్రదించగా బీరువాలో ఐదు తులాల బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు ఉన్నట్లు తెలిపాడు.

రూ.80వేల నగదు.. వెండి అపహరణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో తాళం వేసి ఉన్న రాయవేని సురేందర్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై రమాకాంత్ సోమవారం తెలిపారు. ఇంట్లో నిల్వ చేసిన రూ.80 వేల నగదుతోపాటు 25 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. గ్రామంలోని సురేందర్ ఈ నెల 24న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సగ్రారమం రాజన్నపేటకు వెళ్లాడు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం పగులకొట్టి కనిపించింది. బీరువాను ధ్వంసం చేసి నగదు, వెండి అభరణాలను ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జగిత్యాలలో చోరీ.. నగదు అపహరణ

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణీనగర్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు బోగ కృష్ణహరి అనే వ్యక్తి ఇంటిలోకి చొరబడి బీరువా తలుపులు పగులగొట్టి రూ.20 వేల నగదుతో పాటు తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు అపహరించుకవెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వేలి ముద్రలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో ఒకరికి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ సోమవారం తీర్పు వెలువరించారు. జగిత్యాల పట్టణానికి చెందిన ఉస్మాన్ షేక్ అనే వ్యక్తి అతిగా మద్యం తాగి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి పది రోజుల జైలు శిక్ష విధించారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐబీ రోడ్డులో నివాసం ఉంటున్న వ్యాన్ డ్రైవర్ తోట రాజన్న అలియాస్ తోట రాజిరెడ్డి (54) అనే వ్యక్తి ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన రాజిరెడ్డి కోరుట్లలో భార్యతో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో పాటు మద్యానికి బానిసైన రాజిరెడ్డి సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వారసంత.. ప్రజలకు చింత

- అందుబాటులోకి రాక ప్రజలు, చిరువ్యాపారులకు ఇబ్బందులు
- మహాత్మానగర్‌లో నిరుపయోగంగా నిర్మాణాలు
- పట్టించుకోని పాలకులు

నిర్మాణం పూర్తయినా వాడుకలోకి తీసుకురాకపోవడంతో తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో వారసంత అధ్వానంగా మారింది. అక్కడ చుట్టు పక్కల ఉన్నవారు వారసనంత వద్ద పశువులను కట్టేసుకుంటున్నారు. ఇతర అవసరాలకు వాడుకోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారడంతో పాటు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వారసంతల నిర్మాణం చేపట్టగా మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో నిర్మాణం పూర్తి కాగా నుస్తులాపూర్‌లో మధ్యలోనే పనులు నిలిపివేశారు. కొత్తపల్లి, మొగిళిపాలెంలో పనులు ప్రారంభించకపోవడంతో రద్దు అయ్యాయి. నిర్మాణం పూర్తయిన చోట వారసంతలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మహాత్మానగర్ కూరగాయల వార సంత ఆవరణ

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పాలకులు తూట్లు పొడు స్తున్నారు. ఈ పథకం కింద లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా వాటిని పట్టించుకోకపోవడంతో అధ్వాన్నంగా మారుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తిమ్మాపూర్ మండలానికి 2022లో మహాత్మానగర్, నుస్తులాపూర్, రేణికుంట, నల్లగొండ, కొత్తపల్లి, మొగిళిపాలెం గ్రామాలలో వారసంతలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిని నిర్మించడం ద్వారా ప్రజలకు సౌకర్యంతో పాటు చిరు వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని, అంతే కాకుండా దీంతో గ్రామ పంచా యతీలకు కొంత ఆదాయం వస్తుందనే ఉద్దేశ్యంతో వీటిని నిర్మించేందుకు గత పాలకులు సిద్ధం అయ్యారు. కానీ ఇప్పటికీ అవి అందుబాటులోకి రాలేదు. మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో నిర్మాణం పూర్తి కాగా నుస్తులాపూర్‌లో మధ్యలోనే పనులు నిలిపివేశారు. కొత్తపల్లి, మొగిళిపాలెంలో పనులు ప్రారంభించకపోవడంతో రద్దు అయ్యాయి.


సంత లోపల కట్టేసిన పశువులు

మహాత్మానగర్‌లోని వారసంత అధ్వాన్నం

మహాత్మానగర్ గ్రామ పంచాయతీకి అతి సమీపంలో సుమారు 15లక్షల నిధులతో నిర్మించిన కూరగాయల వారసంత ప్రస్తుతం అధ్వానపరిస్థితిలో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుయని పనులు పూర్తి కాకున్నా గత ఏడాది అక్టోబరు 4న ఈ వారసంతను గత ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించారు. ఆ రోజు వారసంతలో అంతా క్రయవిక్రయ దారులతో నిండుగా కనిపించే విధంగా చేశారు. అంతే మరుసటి రోజు నుంచి తిరిగి ఇప్పటి వరకు దాదాపు సంవత్సరం పూర్తి అయినా అందులో కూరగాయాల విక్రయాలు జరగలేదు. ప్రస్తుతం ఈ వారసంతలో స్థానికులు పశువులను కట్టేస్తున్నారు. గడ్డి పేర్చుకున్నారు బట్టలు ఆరబెట్టుకోవడం, మందు బాబులకు అడ్డాగా మారడంతో పాటు ఇతరాలకు స్థానికులు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం కూరగాయలు బజార్ ఏరియాలో రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులోకి తేవాలి :

మహాత్మానగర్ గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంతను అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వారసంతను నిర్మించడమే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మాణం చేయలేదని, రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వారసంత నిర్మిస్తే ఇటు స్థానికంగా ఉంటే మత్యకారులకు, కూరగాయల విక్రయదారులకు, ఇతర చిరువ్యాపారులకు జీవనోపాధితో పాటు గ్రామ పంచాయతీకీ కూడా కొంత ఆదాయం వచ్చేదని ప్రజలు అంటున్నారు. రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వారసంత ఉంటే రాహదారి వెంబడి వెళ్లే ప్రయాణికులకు కూడా తాజా కూరగాయలు, చేపలు, ఇతర వస్తువులు దొరికేవని ఇప్పటికైనా పాలకులు ఈ వారసంతపై దృష్టి సారించి ఉపయోగంలోని తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. వారసంతకు అనుకులంగా లేని పక్షంలో ఇతర ప్రభుత్వ అవసరాల కోసం నిర్మాణాలు వాడాలని ప్రజలకు కోరుతున్నారు. నిరుపయోగంగా ఉండటంతో నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.


బట్టలు ఆరేసుకుంటున్న స్థానికులు

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :ప్రైవేటు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ యువకుడిని మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన వంశీ అనే యువకుడు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో ఇంటి వద్దనే ఉండి పనిచేసే ఉద్యోగం ఉందంటూ సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనకు వంశీ స్పందించాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి ఉద్యోగం కావాలంటే రూ. 38 వేలు చెల్లించాలంటూ నమ్మించాడు. దీంతో వంశీ గుర్తు తెలియని వ్యక్తికి రూ. 38 వేలను బ్యాంక్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. . అప్పటి నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో మోసపోయానని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

దాడి కేసులో ముగ్గురిపై కేసు

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలో స్వీట్ హౌస్ నిర్వహించే వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులపై జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో స్వీట్ హౌస్ నిర్వహించే పునమ్ అనే వ్యక్తిపై జగిత్యాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో అకారణంగా దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన మహిళకు జైలు

రామగిరి, నవంబరు 25 నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బాలసాని సత్తెమ్మ అనే మహిళ బైండోవర్ ఉల్లంఘించడంతో జైలుశిక్ష విధించినట్లు మంథని ఎక్సైజ్ సీఐ రాకేష్‌కుమార్ తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. గతంలో సత్తెమ్మ గుడుంబా విక్రయించగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. బైండోవర్ ఆంక్షలు ఉల్లంఘిస్తూ గుడుంబా అమ్మకాలు కొనసాగిస్తుండగా కేసు నమోదు చేసి రామగిరి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోవడంతో తహసీల్దార్ 284 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సాయి, సిబ్బంది ఉన్నారు.

ఒకరి మరణానికి కారణమైన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ వ్యక్తి మరణానికి కారణమైన కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన కైలాస్‌రాం అనే వ్యక్తిని సోమవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి గ్రామ శివారులోని కెసిఆర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సిరాజ్(45) అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో ఆటోలో గొల్లపల్లిలోని దర్గాకు వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి తన అత్తగారి ఇల్లు అయిన చంద్రంపేటకు వెలుతుండగా ఈ నెల 10న కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన కైలాస్ రాం అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై మద్యం సేవించి అతివేగంగా వచ్చి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఆటో పక్కన నిలబడి ఉన్న సిరాజ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సిరాజ్‌కు తీవ్రగాయాలు కాగా ఈనెల 18న కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య అఫ్రిన్ ఫిర్యాదు మేరకు కైలాస్ రాంపై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

ఆరుగురికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన (పోక్సో) కేసులో వేములవాడకు చెందిన దొమ్మాటి ఆనంద్, గొల్లపల్లి శశి, పబ్బ రాజేశ్, గౌరవేని నాగరాజు, సయ్యద్ సోహెల్, బొమ్మడి గణేశ్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఇన్‌చార్జి పోక్సో కోర్టు) ఎన్.ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం... 12 ఏప్రిల్ 2018న దొమ్మాటి ఆనంద్, గొల్లపల్లి శశి, పబ్బ రాజేశ్, గౌరవేని నాగరాజు, సయ్యద్ సోహెల్, బొమ్మడి గణేశ్ తనను వేధిస్తున్నారని వేములవాడకు చెందిన బాలిక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత ఆరుగురు నిందితులకు శిక్ష విధించారని ఎస్పీ తెలిపారు.

రైతులంతా కదిలారు.. 'కల్వల' గండి పూడుస్తున్నారు


గండి పడి వృథాగా పోతున్న కల్వల ప్రాజెక్టు నీరు


ప్రాజెక్టుకు గండిని పూడ్చుతున్న రైతులు

శంకరపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలానికి వరప్రదాయమైన కల్వల ప్రాజెక్టుకు పడ్డ గండిని రైతులు సొంత ఖర్చులతో పూడ్చడానికి సోమవారం పూనుకున్నారు. శంకరపట్నం మండలంలోని కల్వల శివారులో ఉన్న ప్రాజెక్టుకు గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు గండి పడింది. అప్పుడున్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాత్కాలికంగా రింగు బండ్ నిర్మాణం చేసి రబీ సీజన్‌లో రైతులకు నీరందించారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో కురిసిన వర్షాలకు మళ్లీ గండి పడింది. పారకమున్న రైతులు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసిన ఫలితం లేకుండాపోయింది. కల్వల ప్రాజెక్టు కింద పారకమున్న కల్వల, వీణవంక మండల రైతులు కొంత సొమ్ము జమ చేసి గండి మరమ్మతు చేసి రబీ సీజన్‌లో సాగు చేసుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్వల ప్రాజెక్టుకు మరమ్మతు చేసి రైతులకు రబీ సీజన్లో సాగునీరు అందించాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గట్టేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జి రమ్య, జోయానవాజ్, హఫ్సా ఐమాన్, గౌసియాలు తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినిలను ప్రధానోపాధ్యాయురాలు వి అన్నపూర్ణ, పీడీ ప్రణయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మధ్యాహ్నం భోజనంపై నిర్లక్ష్యం వహించిన

ఐదుగురు ఉపాధ్యాయులపై చర్యలు

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లలో మధ్యాహ్న భోజనం నిర్వహణలో నిర్లక్ష్యంపై ఐదుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాల్ జడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు జరగడం లేదన్న కారణంతో ఫుడ్ ఇన్‌చార్జిగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ వి వెంకటరమణ రావును సస్పెండ్ చేయడంతో పాటు ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామికి వివరణ కోరుతూ మెమో జారీ చేశారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలలో నాణ్యత లేదన్న కారణంతో పాఠశాల ఫుడ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడు సీహెచ్ కిషోర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి లతను వివరణ అందజేయాలని ఆదేశిస్తూ మెమో జారీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాల్ గ్రామంలో గల మండల పరిషత్ పాఠశాలలో భోజనం నాణ్యత సరిగా లేదన్న కారణంతో ఫుడ్ ఇన్‌చార్జిగా ఉన్న ఉపాధ్యాయుడు ఎం ప్రవీణ్ కుమార్‌కు మెమో జారీ చేశారు.

రాజీవ్ రహదారిపై బొగ్గు లారీ బోల్తా


రోడ్డుపై బొగ్గు

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొగ్గు లోడ్‌తో వెలుతున్న ఓ లారీ అదుపు తప్పి రాజీవ్ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి బోల్తా పడింది. దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సంఘటనలో డ్రైవర్ తదితరులకు స్వల్ప గాయాలయ్యాయి. మహారాష్ట్ర నుంచి బొగ్గు లోడ్‌తో వస్తున్న లారీ సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి వద్ద గల మూల మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్ ఎక్కి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న బొగ్గంతా రోడ్డుపై పడిపోగా రాకపోకలకు ఆటంకం కలిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బొగ్గును వేరే లారీ లో లోడ్ చేయించి రాకపోకలను పునరుద్ధరించారు.

మద్యం మత్తులో భార్య, అత్తపై దాడి

వేములవాడ రూరల్, నవంబరు25,(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్య, అత్తపై అల్లుడు రోకలితో దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లి గ్రామానికి చెందిన మొగిలి రాముకు కథలాపూర్ మండలం గంభీపూర్ గ్రామానికి చెందిన జలతో వివాహం జరిగింది. వీరికి మూడు సంవత్సరాల కూతురు ఉంది. మద్యానికి బానిసైన రాము తరుచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. దీంతో ఆమె కొన్ని నెలలనుండి తన తల్లిగారి ఇంట్లో ఉండేది. 15 రోజుల క్రితం కథలాపూర్ పోలీస్‌స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించడంతో పెద్దల సమక్షంలో తిరిగి అత్తగారి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో తన కూతురును చూడడానికి లచ్చవ్వ ఆదివారం మర్రిపల్లికి వచ్చింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాము తన భార్యతోపాటు అత్తపై రోకలిబండతో దాడి చేసాడు. దాడిలో గాయపడ్డ ఇద్దరిని స్థానికులు కరీంనగర్‌కు తరలించారు. రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం


రాము (ఫైల్)

కథలాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంటకు చెందిన అందె రాము (32) అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం..రాముకు గత ఏడాది కిందట ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ యువతితో వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు చోటుచేసుకోవడంతో మూడు మాసాల కిందట పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాము గ్రామ సమీపంలోని వీర్ల గుట్ట వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతూ కేకలు వేయడాన్ని అటువైపు వెళ్తున్న వ్యక్తులు గమనించారు. చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జగిత్యాలకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.

కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచులు

● అడ్డుకుని అరెస్టు చేసిన పోలీసులు

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి వచ్చే వారిని కరీంనగర్ శివారు ప్రాంతాల్లోనే అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచులు దశల వారీగా అక్కడికి చేరుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్లుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రూ.700 కోట్లకు వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బకాయిల కోసం తిరుగుతున్నామని, ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. అయినా తమ బిల్లులు విడుదల చేయడం లేదన్నారు. అప్పులు చేసి, బంగారం అమ్మి అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు తమకు రావలసిన బిల్లులు విడుదల చేయలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అప్పుల పాలయ్యామని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ బకాయిలను చెల్లించాలని కోరారు.


కలెక్టరేట్ ముట్టడికి వచ్చిన మాజీ సర్పంచ్‌లను అడ్డుకుంటున్న పోలీసులు

నకిలీ పత్రాలతో ఇల్లు కబ్జా

● ఉన్నతాధికారులను ఆశ్రయించిన బాధితుడు ● పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి

గొల్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఫోర్జరీ సంతకాలకు నిలయంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫోర్జరీ సంతకాలతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన ఓ మహిళ ఏకంగా ఒక ఇంటినే కబ్జా చేయడమే కాకుండా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రికార్డుల్లో తన భర్త పేరును ఇంటి యజమానిగా రికార్డుల్లోకి నమోదు చేసుకుంది.. బాధిత వ్యక్తి ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు కొద్ది రోజుల క్రితం విచారణ జరపడంతో అసలు విషయం వెలుగుచూసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు బాధ్యులపై పోలీసు స్టేషనల్ ఫిర్యాదు చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వివరాల్లోకెళితే.. గొల్లపల్లి మండల కేంద్రంలోని ఇంటి నెం 5-88 అనే ఇల్లు ఇటీవలి వరకు మ్యాదరి ఆశయ్య పేరిట ఉండేది. ఆశయ్యకు ముగ్గురు కొడుకులున్నారు. ఒక కొడుక్కి ముంబైలో ఉన్న ఇంటితో పాటు ఉద్యోగం అప్పగించారు. మిగితా ఇద్దరికి గొల్లపల్లిలో ఉన్న సదరు ఇల్లు సమానంగా పంచుకోవాలని తల్లిదండ్రులు తీర్మానించారు. ఆశయ్య 1986లో మృతి చెందగా అప్పటినుంచి 2024 వరకు చిన్న కొడుకైన ఏసుదాసు ఇంటి బిల్లు చెల్లిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద కొడుకైన స్వామిదాసు ఆశయ్యకు తాను ఒక్కడినే కొడుకునని రెవెన్యూ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి మల్యాల సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇటీవల స్వామిదాసు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో చిన్న కొడుకైన ఏసుదాసు ఉపాధి నిమిత్తం ముంబై వెళ్లి కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగిరాగా తన కుటుంబంతో కలిసి తన ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో స్వామిదాసు భార్య మ్యాదరి లక్ష్మీ ఈ ఇల్లు తనదని, మీరెలా ఉంటారంటూ ఏసుదాసును ఇంట్లో నుంచి వెళ్లగొట్టినట్లు బాధితుడు కన్నీళ్లపర్యంతమయ్యాడు. తన మీద, తన భార్య పిల్లల మీద దాడి చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన ఎంపీవో సురేష్‌రెడ్డి నకిలీ ధ్రువ పత్రాలతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించారు. దీనిపై ఒక నివేదికను తయారు చేసి జిల్లాస్థాయి అధికారికి పంపించగా రికార్డుల్లో నుంచి స్వామిదాసు పేరును తొలగించి యథాతథంగా నమోదు చేయాలని, సహకరించిన సిబ్బందిపై, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలి

● హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి వార్షికోత్సవ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కనీస మద్దతు ధర చెల్లించినపుడే రైతుకు న్యాయం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాలు నిండిన రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలకు నెలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రతి రైతుకు బీమాతో పాటు పంట బీమా కల్పించాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను ఉత్పత్తి చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకొని వాటి వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఇస్తున్న పరిహారాన్ని రెట్టింపు చేయాలని, ఆ పరిహారాన్ని సంబంధిత కుటుంబానికి 30 రోజుల్లో అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అందించే రుణ సాయం, రైతు బంధు, రుణమాఫీ, సబ్సిడీలు కౌలు రైతులకు కూడా ఇవ్వాలని కోరారు. గిడ్డంకులు ఏర్పాటు చేసి రైతు పంటలు నిల్వచేయడానికి అవకాశం కల్పించాలన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాడి పశువులకు బీమా కల్పించాలని, ఆదివాసీల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమల కోసం ప్రభుత్వం భూసేకరణ చేయవలసివస్తే, భూమికి బదులుగా మరోచోట వ్యవసాయభూమి ఇవ్వాలని చంద్రకుమార్ డిమాండ్ చేశారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఐదో వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్ద వెంకటరెడ్డి, సుతారి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

రామగుండం రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు


దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అంతర్గాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం రైల్వేస్టేషన్‌లో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అధ్వర్యంలో సివిల్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, స్పెషల్ పార్టీ పోలీసులు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ లోని ప్లాట్‌ఫామ్‌లతో పాటు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేసేందుకు పోలీస్ శాఖ అధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో యువత నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు ప్రవీణ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, బుర్ర సురేష్‌గౌడ్, ఎస్‌ఐలు వెంకట స్వామి, సంధ్యారాణి, జీఆర్‌పీ ఇన్‌చార్జి తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్. మడుగు పక్కన ఉన్న కొండ

పర్యాటక శోభకు శ్రీకారం

- గోదావరి నదిలో రెండు గుట్టల మధ్య సహజ సిద్ధంగా వెలసిన ఎల్. మడుగు
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి సన్నాహాలు
- ఎల్. మడుగు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నేడు శంకుస్థాపన

మంథని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గలగల పారే గోదావరి నది ప్రవాహ పరుగులకు అడ్డుకట్టలా రెండు గుంటల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన ఎల్. మడుగు (మొసళ్ల సంరక్షణ కేంద్రం) ప్రకృతి అందాలకు ప్రభుత్వం పర్యాటక శోభను తీసుకురావటానికి శ్రీకారం చుట్టింది. విలువైన మత్స్య, వన సంపదలకు నెలవుగా ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకర్షించే ఎల్. మడుగును పర్యాటక కేంద్రగా అభివృద్ధి చేయటానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు అనేక అభివృద్ధి పనులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం నుంచి ఇటీవల మంజూరైన రూ. 7 కోట్ల నిధులతో మంథని-కాటారం ప్రధాన రహదారి నుంచి వయా ఖానాపూర్ మీదుగా ఎల్. మడుగు ఉన్న గోదావరినది వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. తొలుత డబుల్ రోడ్డు పనులు పూర్తిచేసిన తర్వాత గోదావనదిలో, తీరంలో పర్యాటకులు ప్రకృతి ఒడిలో సేద తీరేలా పలు అభివృద్ధి పనులు, ఇతర వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు.

ఇటీవల రాష్ట్ర టూరిజం ఎండీ ప్రకాష్‌రెడ్డి సందర్శించి చేపట్టాల్సిన పనులు గురించి ఆరా తీశారు. ఈ మేరకు బోటింగ్, కాటేజీలు, ఇతర వసతులు గురించి ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రకృతి సోయగాలకు నిలువెత్తు నిదర్శనంగా విరాజిల్లుతున్న ఎల్. మడుగు ప్రత్యేకత ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తోంది. అంతరించిపోతున్న మొసళ్ల పెంపక కేంద్రంగా, మత్స్య సంపద బాండాగారంగా ఎల్. మడుగు విరాజిల్లుతోంది. ఎల్. మడుగు ఇటు ప్రకృతి సోయగాలు పర్యాటక కేంద్రంగా ఆహ్లాదాన్ని పంచే జలాశయంగా కీర్తి గడించే అవకాశం ఉంది.

రెండు గట్టల మధ్య ఏర్పడ్డ మడుగు..

మంథని నుంచి తూర్పు వైపు మూడు కిలోమీటర్ల దూరంలో ఖానాపూర్ గ్రామం శివారులో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల సరిహద్దుగా ఉన్న రెండు గుట్టలు అతి దగ్గరగా ఉండి గోదావరి నది ప్రవాహానికి అడ్డు తగలడంతో సహజ సిద్ధంగా మడుగు ఏర్పడింది. దాదాపు 50 మీటర్లకు పైగా మడుగు లోతుగా ఉన్నట్లు అంచనా. దీంతో ఎంతటి వర్షాభావ పరిస్థితుల్లో నైనా ఎల్. మడుగు నీరు పుష్కలంగా నిల్వ ఉంటుంది.

అడవులు, గుట్టలతో ఎల్. మడుగు అందాలు..

నిత్యం నిండు కుండలా ఉండే మడుగుకు ఇరువైపులా ఉన్న గుట్టలపై పచ్చదనం పరుచుకునేలా చెట్లు ఉన్నాయి. ఇవతలి వైపు, అవతలి వైపు ఉన్న ఎత్తైన గుట్టలు కనువిందు చేస్తాయి. గుట్టలపై నుంచి కిందికి చూస్తే జలాశయాన్ని తలపించే ఎల్. మడుగు, పక్కలకు చూస్తే కింద నేలపై పచ్చని తివాచి పర్చినట్లు కన్పించే పొలాలు, పైన భారీ వృక్ష సంపద దృశాలు అందరినీ ఆకట్టుకుంటాయి.

ఎల్. మడుగు చరిత్ర..

స్థానికంగా ప్రాచుర్యంలో ఉన్న పురాతన కథనం ప్రకారం.. ఎల్. మడుగు ఇవతలి వైపు గ్రామానికి చెందిన ఓ వివాహిత అవతలి వైపు గుట్ట సమీప ప్రాంతంలో ఉన్న వ్యక్తితో ఉన్న పరిచయం కారణంగా నిత్యం ఎండుకుండను పొట్ట క్రింద పెట్టుకొని ఈదుకుంటూ మడుగు దాటి వెళ్ళి తిరిగి వచ్చేది. సదరు వివాహిత ప్రవర్తనతో విసుగు చెందిన భర్త కాల్చని కుండను ఆమె కుండ తీసుకొని వెళ్లే స్థానంలో పెట్టడంతో గమనించకుండా అదే కుండను తీసుకొని ఈదుకుంటూ మడుగు దాటుతుండగా మార్గ మధ్యలో కుండ పూర్తిగా విచ్చుకు పోయి వివాహిత మడుగులో పడి మృతి చెందడంతో ఎల్. మడుగుగా ఈ పేరు వచ్చినట్లు స్థానికులు చెప్పుకుంటారు.

మొసళ్ల పెంపక కేంద్రం..

గోదావరినదికి అవతలి వైపు ఉన్న మంచిర్యాల జిల్లా, మంచిర్యాల ఫారెస్టు రేంజ్ పరిధిలోని శివ్వారం వన్యప్రాణి అభయారణ్య కేంద్రంగా ఉన్న ఎల్. మడగులో అటవీశాఖ వారు మొసళ్ళ సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మడుగులో ఉన్న మొసళ్లను సంరక్షించడంతో పాటు అవి పెట్టే గుడ్లు పిల్లలు అయ్యేంత వరకు రక్షించి నదిలో సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మడుగులోని మొసళ్ల ఏకాంతానికి భంగం కలగకుండా, ఇతరుల నుంచి వాటికి ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు 60 నుంచి 70వరకు మొసళ్లు మడుగులో ఉన్నట్లు, వీటిలో కొన్ని 50 సంవత్సరాలకు పైగా వయస్సున్నట్లుగా అంచనా. ప్రశాంతంగా ఉండే సమయాల్లో ఉదయం, సాయంత్రం నది తీరంలో ఉండే రాతి బండలు, ఒడ్లపైకి మొసళ్లు వచ్చి సేద తీరుతాయి. ఈ సమయంలో వీటిని సహజ సిద్ధంగా చూడటం వీనుల విందే.

విలువైన మత్స్య సంపద..

విలువైన మత్స్య సంపదకు నిలయంగా ఉంది. బొమ్మెలు, రొయ్యలు, కొర్ర మట్టలు, రావులు, బుడ్డ పరకలు, అలుగులు, జెల్లలు లాంటి వివిధ రకాల చేపలు దొరుకుతాయి. గోదావరి నది మత్స్య సంపదకు మంచి రుచి ఉంటుండంతో ఇక్కడ కొంత మంది చేపలు మంథని, గోదావరిఖని, సెంటినరీకాలనీ, భూపాలపల్లి, కాటారం, అవతలి వైపు మంచిర్యాల, శ్రీరాంపూర్ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పురాతన ఆలయం, చారిత్రక కట్టడం..

గోదావరి నదిలోని ఎల్. మడుగు అవతలి వైపు మంచిర్యాల జిల్లా శివారులో ఉన్న గుట్టపై పురాతన ఆలయం, చారిత్రక కట్టడాలను చూస్తే కనువిందు చేస్తాయి. అనాదిగా జన సంచారం లేక ప్రకృతి పరంగా, ధ్వంసం కావడంతో పాటు గుప్త నిధుల కోసం దుండగులు ధ్వంసం చేసిన శిథిలమైన శివాలయం, ఇతర కట్టడాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. కాకతీయ కళా వైభవానికి అద్దం పట్టేలా గుట్టలోని ఆలయాన్ని, ఇతర నిర్మాణాలను మలిచిన తీరు అందరినీ ఆకర్షిస్తున్నాయి.


గోదావరినదిలో ఎల్ మడుగు ప్రాంతం

మ్యూచువల్ ఫండ్స్ పేరుతో రూ.70 వేలకు టోకరా

కరీంనగర్ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుతో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించి మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూటౌన్ పోలీసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మొగిలి లక్ష్మయ్య అనే వ్యక్తికి ఈ నెల 19న ఒక బ్యాంకు నుంచి మనూష అనే మహిళ ఫోన్ చేసి మొదట లోన్ కావాలా అని అడిగింది. తనకు అవసరం లేదని లక్ష్మయ్య అనడంతో క్రెడిట్ కార్డు ఉంటే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే రెండు లక్షల రూపాయలు లాభం వస్తుందని చెప్పి క్రెడిట్ కార్డు వివరాలు తీసుకుంది. అతని క్రెడిట్ కార్డు నుంచి 66,998 రూపాయలు కట్ అయ్యాయి. డబ్బులు ఎందుకు కట్ అయ్యాయని అడిగితే మూడు రోజుల్లో జమ అవుతాయని చెప్పింది. కానీ డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయానని మొగిలి లక్ష్మయ్య గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లికి చెందిన కుమార్ (40) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుమార్ కొన్నిరోజులుగా గుండె సమస్యతో బాధపడుతున్నాడు. తన ఆరోగ్యం బాగుచేయించుకోవడం కోసం అప్పులు చేశాడు. అప్పులు తీరక, ఆరోగ్యం బాగుపడకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 20వ తేదీన తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృత్యువాతపడ్డాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

వీణవంక, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరీష్ అనే విద్యార్థి జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ షాబీర్‌పాషా సోమవారం తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యార్థిని ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్, ఎస్ఎంసీ సెక్రటరీ మధు జాన్సన్‌లు అభినందించారు.

ఆలయాల్లో కార్తీక సందడి


గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు


గోదావరి హారతి


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

- భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం
- ధర్మపురి క్షేత్రంలో ఘనంగా పూజలు
- గోదావరిలో దీపాలు వదిలిన మహిళలు

వేములవాడ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా రాజరాజేశ్వర స్వామికి ప్రీతపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకునేందుకు సుమారు ఐదు గంట లపాటు భక్తులు క్యూలైన్‌లో నిరీక్షించారు. ధర్మదర్శనం క్యూలైన్‌లో స్వామి వారి దర్శనానికి వెళ్లిన భక్తులు మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టగా శీఘ్రదర్శనం క్యూలైన్‌లో వెళ్లిన భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. సుమారు లక్ష మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించు కున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు రాజన్న ఆలయానికి పోటెత్తారు. వేములవాడకు భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక దీపాలను వెలిగించారు.

బద్దిపోచమ్మ ఆలయంలో రద్దీ

రాజన్న ఆలయానికి ఆదివారం వచ్చిన భక్తులు సోమ వారం ఉదయం రాజన్నను దర్శించుకొని అనంతరం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయా నికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో గంట పాటు క్యూలైన్‌లో నెత్తిన బోనాలతో భక్తులు బారులు దీరారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు అమ్మవారికి నైవే ద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురి, (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆఖరి సోమవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. లక్ష్మీ నృ సింహస్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణ దారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు, పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.


వేములవాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

24వ రోజు గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 24వ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, గోదా వరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు నదీ మాతకు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.


భక్తులతో కిక్కిరిసిన వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణం

సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు

లాభాలు ఆర్జిస్తున్న యువరైతు


మల్లేశం సాగు చేస్తున్న తోటలోని తైవాన్ జామ కాయలు

గంభీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం అనే యువ రైతు. మల్లేశం తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేసేవాడు. సంప్రదాయ పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టాలని ఆలోచిం చాడు. అధిక సాంద్రత పద్ధతిలో జామ తోటను సాగు చేయాలని నిర్ణ యించుకున్నాడు. రెండేళ్ల కిందట ఖమ్మం జిల్లా అశ్వరావుపేట నుంచి 700 తైవాన్ జామ మొక్కలను 30 రూపాయల చొప్పున కొనుగోలు చేసి తెచ్చాడు. ఎకరం భూమిలో మొక్కల వరుస మధ్య మీటరు దూరం ఉండేలా నాటాడు.

రసాయన ఎరువులు క్రిమిసంహారక మందులు వాడకుండా జీవామృతం కోళ్ల ఎరువు, పశువుల పేడ, వేప పిండి, వేపానునూనెతో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు చేస్తున్నాడు. పొలంలో కలుపు లేకుండా ఎప్పటికప్పుడు తొలగి స్తున్నాడు. కోతులు, అడవి పందుల బెడద రక్షించుకునేందుకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. జామ మొక్కలు నాటిన నాలుగు నెలలకు కాతకు వచ్చింది. ఏడాదికి మూడు సార్లు పంట చేతికొస్తుండగా క్రాప్‌కు పది క్వింటాళ్ల దిగుబడి సాధిసున్నట్లు, కిలో జామ రూ.60 చొప్పున విక్రయిస్తున్నట్లు రైతు పేర్కొంటున్నాడు.

మంచి లాభాలు: బొంగు మల్లేశం, యువరైతు, నర్మాల



తైవాన్ జామకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. జామ కాయల అమ్మకాలతో లాభాలు వస్తున్నాయి. ఎకరానికి పంటకు సగటున 10 క్వింటాళ్ల జామ కాయలు పండిస్తున్నా. మార్కెట్‌లో కిలో జామకు ధర 60 రూపాయలు పలుకుతోంది. పెట్టుబడి పోను పంటకు రూ.50 వేల ఆదాయం వస్తోంది.

జేఎన్టీయూలో జాతీయ స్థాయి వర్క్‌షాప్

రామగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు సీఎస్ఈ, సీఎస్ఎం విద్యార్థులతో జాతీయస్థాయిలో నిర్వహించే వర్క్‌షాప్ బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. మిషన్ లర్నింగ్ అండ్ బిగ్ డేటాపై జరిగే వర్క్‌షాప్‌లో పాల్గొనే విద్యార్థులు రూ.400 రిజిస్ట్రేషన్ చెల్లిస్తే భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 7981686589, 8688368187 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెంటెండ్ రవికుమార్, కన్వీనర్ తిరుపతి, ఫ్యాకల్టీ ఓ-ఆర్డినేటర్ నరహరి, శ్రీనివాస్‌రావు, వంశీకృష్ణ, శ్రీధర్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్ సందీప్‌కుమార్, అంకిత, దేవి శరణ్, సహస్ర తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఈనెల 30న రాత్రి 8 గంటల నుంచి నగరంలోని ఖాన్‌పుర క్రిస్టల్ కన్వెన్షనలో నిర్వహించే అంతర్జాతీయ హసియా కవి సమ్మేళనం పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు.

సొసైటీ ఆహ్వానం మేరకు తాను తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు మొహమ్మద్ రియాజ్ అలీ రజ్వీ, సయ్యద్ ఇష్తియాక్ అహ్మద్, కార్యదర్శి మీర్ షౌకత్ అలీతో పాటు షఫీక్ అహ్మద్, షరీఫ్ బాబా, అంజత్ సలీం అంజత్, రాహిల్ కరీంనగర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్తీక దీపోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీలలితా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, యువతులు, భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

'పారమిత' విద్యార్థుల విహారయాత్ర

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 250 మంది పదో తరగతి విద్యార్థులు ఐదు రోజుల పాటు విశాఖ పట్టణానికి విహారయాత్రకు వెళ్లారు. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, మానసిక ఉల్లాసం నింపడానికి ప్రతి సంవత్సరం విహారయాత్రలకు పంపిస్తామని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు తెలిపారు. దీంతో విద్యార్థులలో నూతనోత్తేజం పెరిగి చదువుపై మరింత ఆసక్తి కనబరుస్తారని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు తెలిపారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంను సోమవారం పలువురు యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కిమ్ ఫహాద్, మాడుగుల ప్రవీణ్, జప శ్రావణ్‌రెడ్డి, గట్టు ప్రశాంత్, మందల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు భావ వ్యక్తీకరణ ప్రధానం'


విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భాషతో పాటు భావ వ్యక్తీకరణ, విషయం పట్ల అవగాహన చాలా ముఖ్యమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను స్టూడెంట్స్ టాక్ కార్యక్రమానికి పంపేందుకుగాను పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయిలో ప్రభుత్వ విద్యార్థుల ఎంపిక కార్యక్రమంలో ప్రభుత్వ ధన్గర్‌వాడీ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈకార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ తెలుగుతో పాటు ఆంగ్ల భాష కూడా నేర్చుకోవడం ముఖ్యమని అన్నారు. మన భావాలను సంస్కృతిని ప్రపంచం ముందుకు తీసుకెళ్లేందుకు ఆంగ్ల భాష తోడ్పడుతుందని కలెక్టర్ పమేలా సత్పతి చెప్పారు. టీఈడికి ఎంపిక కాకపోయినా విద్యార్థులు ఇప్పుడు నేర్చుకున్న విషయాలు జీవితంలో ఉపయోగపడతాయని అన్నారు. ఓటమితో నిరాశ పడకుండా ప్రయత్నిస్తే విజయం తప్పక సాధిస్తారని ఆమె సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలిక ఎప్పటికైనా ప్రపంచ వేదికపై ఉపన్యాసం ఇవ్వాలని తన కోరిక అని కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్‌రావు, మండల విద్యాధికారి అబ్దుల్ అజీమ్, సర్వశిక్ష అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ అశోకొరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో రవీందర్

కరీంనగర్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి రవీందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో క్లాస్ రూములను తనిఖీ చేసి విద్యార్థుల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉన్నారు.

ఐదు గ్యారెంటీలు అమలు చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ధర్మ సమాజ్‌పార్టీ నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి కల్పించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి కల్పించాలనే ఐదు డిమాండ్లను అమలు చేసినపుడు మాత్రమే వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. వెంటనే ప్రభు త్వం స్పందించకుంటే త్వరలోనే ఆమరణ రిలే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు తాళ్ళ నరేష్, ఉపాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, కోశాధికారి బాబు, కార్యదర్శి రాకేశ్, సదానందం, సురేష్, భూపతి పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, కొలువు, తోమాలసేవ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, శ్రీసూక్త హోమం, మహాభిషేకం, అనంతరం సామూహిక కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం దీపోత్సవం, సహస్రనామార్చన, అన్నప్రసాద జరిగాయి. ఈ కార్యక్రమంలో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్‌శర్మ, సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

భగత్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్చ్యూన్ మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని మల్కా పూర్ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిం చారు. మల్కాపూర్‌లోని ఆదర్శ యువజన సంఘం భవనంలో నిర్వహించిన మెడికల్‌క్యాంపులో 130మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గొట్టె జ్యోతి పోచయ్య, కాసారపు శ్రీనివాస్, క్యాంపు కో-ఆర్డినేటర్ రాళ్లబండి శంకర్ ప్రసాద్‌రెడ్డి, మేనేజర్ గణేష్, రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు భరత్ ముదిరాజ్, లచ్చయ్య, దేవేందర్‌రెడ్డి, వెంకటేశ్, ఎల్లయ్య, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు భిక్ష

కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జెడ్‌పి క్వార్టర్స్‌లోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం భిక్షా కార్యక్రమాన్ని ఈట కొన్న కాంతారెడ్డి గురుస్వాములు, దీక్షాపరులతో కలసి ప్రారంభించారు. అంతకు ముందు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి ప్రసాదం అందజేయగా తాను అన్నప్రసాదానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. జనవరి 8వ తేదీ వరకు సాగే ఈ భిక్షకు, డిసెంబరు 1వ తేదీ నుంచి జనవరి 1వ వరకు ఉదయం తేనీరు, సాయంత్రం అల్పాహారం కోసం దాతలు, దీక్షాపరులు సహాయ సహకారాలందించి ఆలయంలో రశీదు పొందాలని ఈట కోరారు.

●కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బొమ్మకల్ రోడ్ కృష్ణానగర్, అయ్యప్ప నూతన ఆలయ నిర్మాణం వద్ద అభయాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం దీక్షాపరులకు భిక్ష వితరణ ప్రారంభమైంది.

అర్చకుడు తాటిచెర్ల హరికిషన్‌శర్మ పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దాతలు, దీక్షధారులు ధన, ధాన్య రూపేణ సహాయసహకారాలందించాలని కోరారు. జనవరి 2వ తేదీ వరకు భిక్ష కొనసాగుతుందని తెలిపారు.

'ఉపాధి' జాతర

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తలపెట్టింది. ఈ పనులు పూర్తి చేసేందుకు నాలుగు నెలల గడువు లభిస్తుండడంతో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పూర్తిచేసే అవకాశం లభించనున్నది. పొలంబాటలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణం, హార్టికల్చర్, చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు, పంట పొలాల్లో నీటి కుంటల నిర్మాణం, జలనిధి కార్యక్రమంలో వర్షపు నీటి ఇంకుడు గుంతల నిర్మాణం, బోర్‌వెల్స్ రీచార్జి, వ్యవసాయ బావుల నిర్మాణం చేపడతారు. గ్రామీణ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా టాయిలెట్లు, సోప్‌పిట్స్ నిర్మాణం మహిళాశక్తి ఉపాధి భరోసా కింద వేయి బర్డ్స్‌తో పౌల్ట్రీల ఏర్పాటు, వర్మీకంపోస్టు తయారీ యూనిట్లు, క్యాటిల్ షెడ్లు, పశుగ్రాస పెంపక యూనిట్లు ఏర్పాటు చేస్తారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో హార్టికల్చర్ సాగును ఈ పనుల్లో భాగంగా చేపడతారు. ఆయా మండలాల్లో అవసరాన్ని బట్టి ఈ అన్ని పనులనుగాని, కొన్ని పనులను గానీ చేపట్టి నిధులు మంజూరు చేస్తారు. కరీంనగర్ రూరల్ మండలంలో మంగళవారం ఈ పనులను చేపట్టడం ద్వారా ఉపాధి పనుల జాతరకు శ్రీకారం చుడుతున్నారు.

విద్యుత్ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమావేశం

గణేశ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ యాక్షన్ ప్లాన్ కో ఆర్డినేషన్ సమావేశాన్ని సోమవారం టీజీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయంలో నిర్వహించారు. రాబోయే వేసవిలో చేయవలసిన కార్యక్రమాల గురించి ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనివాస్, టిజి ఎన్‌పీడీసీఎల్ కంబైన్డ్ సర్కిల్ ఎస్‌ఈలు రమేష్‌బాబు, కే.మాధవరావు, సాలియా నాయక్‌లు సమావేశంలో చర్చించారు. 220 కెవి సబ్ స్టేషన్లు, 132 కెవిసబ్‌స్టేషన్లు, అదనపు పిటిఆర్‌ల ఏర్పాటు, కొత్త బ్రేకర్లు, కొత్త లైనులు ఏర్పాటు తదితర అంశాలపై కోఆర్డినేషన్ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో విజయేందర్ రెడ్డి, తిరుపతి, లక్ష్మారెడ్డి, చంద్రమౌళి,రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంపత్, ప్రసాద్, వి.ఎస్.రావు, రఘు, గంగారాం, ప్రభాకర్, ఏడీలు తదితరులు పాల్గొన్నారు

వింధ్యావాలి విద్యార్థులకు అవార్డులు


విద్యార్థినులను అభినందిస్తున్న వింధ్యావాలి ప్రిన్సిపాల్ ప్రశాంత్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెహర్‌నగర్ వింధ్యావాలి పాఠశాల విద్యార్థులు భాష్య, శ్రీమయి ఆదివారం కీర్తి ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన కార్తీక శివ నృత్యాంజలి అవార్డులను హైదరాబాద్ రవీంద్ర భారతిలో అందుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కాంతార శాస్త్రీయ కూచిపూడి నృత్యం అలరించగా అవార్డులను నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేణుగోపాలాచారి చేతుల మీదుగా అందుకున్నారు. సోమవారం విద్యార్థినులను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశరావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపల్ జి ప్రశాంత్ అభినందించారు.

కార్తీక సోమవారం పూజలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు శివ, కేశవాలయాల్లో సోమవారం కార్తీక పూజలు నిర్వహించారు. పాతబజార్ గౌరీశంకర, కమాన్‌రోడ్ రామేశ్వర, భగత్‌నగర్ భవానీశంకర, ఆదర్శనగర్ రాజరాజేశ్వర, జెడ్‌పి క్వార్టర్స్‌లోని శివాలయాలు, చైతన్యపురి మహాశక్తి, భగత్‌నగర్ అంజనాద్రితో పాటు పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేక అర్చనల్లో పాల్గొన్నారు.

దీపాలు వెలిగించి పూజలు జరిపారు. వేంకటేశ్వర, రామ, ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా భక్తుల సందడి నెలకొంది. ఆయా ఆలయాల అధికారులు, నిర్వాహకులు భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.

టీజీసీటీఏ జిల్లా కార్యవర్గాన్ని అభినందించిన ఎస్సారార్ ప్రిన్సిపాల్

గణేశ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ఎస్‌ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల కరీంనగర్ టీజీసీటీఏ జిల్లా కార్యవర్గాన్ని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం అభినందనలు తెలిపారు. కళాశాలలో జిల్లా స్థాయి టీజీసీటీఏ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా డా.హర్‌జ్యోత్ కౌర్, కార్యదర్శిగా డా.ప్రభాకర్, కోశాధికారిగా డా.బూర్ల నరేష్, మహిళా కార్యదర్శిగా డా.శ్యామల ఎన్నికయ్యారు.

వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ అభినందిస్తూ కళాశాల అభివృద్ధికి వీరి సేవలు ఎంతో అవసరమని అన్నారు. కళాశాల టీజీసీటీఏ యూనిట్ అధ్యక్షులు డా.బూర్ల చంద్రశేఖర్, కార్యదర్శి డా.రాజేష్, కోశాధికారి డా.బండి అశోక్, సభ్యులు డా.రాజేష్, డా. సతీష్, డా.అర్జున్, డా.అర్చన, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

కొత్తపల్లిని కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దు

-మున్సిపల్ సాధారణ సమావేశంలో సభ్యుల తీర్మానం


అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కు వినతిపత్రం ఇస్తున్న చైర్మన్ రుద్ర రాజు

భగత్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మున్సిపాలిటీని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్, సభ్యులు తీర్మానం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం చైర్మన్ రుద్ర రాజు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కొత్తపల్లిని కరీంనగర్‌లో విలీనం చేయవద్దని తీర్మానం చేశారు.

కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● అదనపు కలెక్టర్‌కు వినతి

కొత్తపల్లి మున్సిపాలిటీని కరీంనగర్‌లో విలీనం చేయవద్దని కోరుతూ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజుతో, సభ్యులు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : రసమయి

మానకొండూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అమలు కాని హామీలతో గద్దెనెక్కి ఏడాది కావస్తునా వాటిని అమలు చేయడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఏడాది కావస్తున్నా అమలు చేయడంలో కాలయాపన చేస్తుందన్నారు. ఈ నెల 29న కరీంనగర్‌లో నిర్వహించే దీక్షా దీవస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

మానకొండూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలను సోమవారం జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులతో చర్చించారు. మండల విద్యాధికారి ఎం. మధుసుధనాచారి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులుఉన్నారు.

శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో ఓరియంటేషన్ డే


మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య ఫార్మసీ కళా శాలలో బి.ఫార్మసీ, ఫామ్‌డీలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఫార్మసీ రంగంలో ఉన్నత స్థాయికి చేరాల ని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామ నరసింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీ ఎన్నిక

హుజూరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా కందుగుల గ్రామానికి చెందిన ఇమ్మడి శ్రీధర్‌ను, ఎంఎస్పీ మండలాధ్యక్షుడిగా పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన శనిగరపు దేవేందర్‌లను నియమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, నాయకులు తుంగ ఆంజనేయులు, శ్రీనివాస్, శేఖర్, అశోక్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి గ్రామస్థుల అండ


డిపాజిట్ పత్రాలు అందిస్తున్న గ్రామస్థులు

జమ్మికుంట రూరల్, నవంబర్ 25: జమ్మికుంట మండలం మాచన పల్లి గ్రామానికి చెందిన ఒజ్జ వెంక టేష్ ఇటీవల అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. కాగా గ్రామస్థులు ఆ కుంటుబానికి అండగా నిలిచి లక్షా నలభై వేలు జమ చేశారు. అందులో నుంచి ఇరువై వేల నగదు దహన సంస్కారాల నిమిత్తం ఖర్చు చేశారు. మిగిలిన లక్షా ఇరువై వేల నగదును మృతుడి కుమార్తె పేరిట డిపాజిట్ చేసి, ఆ పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం


కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ వేముల లావణ్య అంజీ తదితరులు

గంగాధర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుం టామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మండలం మధురానగర్ తాజామాజీ సర్పంచ్ వేముల లావణ్యఅంజీతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కండువావేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉప్పరమల్యాలలో పోచమ్మ(శీతలదేవి) విగ్రహ ప్రతిష్ఠకార్యక్రమానికి హాజరై మొక్కులు చెల్లించు కున్నారు. కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు, మండలాధ్యక్షుడు పురమల్ల మనోహర్, గంగాధర సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, అట్ల రాజిరెడ్డి, తోట సంధ్యపడితపల్లి కిషన్ పాల్గొన్నారు.

ఇప్పనపల్లి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

చొప్పదండి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇప్పనపల్లి చారిటబుల్ ట్రస్టు సామాజిక సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండిలో సోమవారం ఇప్పనపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ద్వారా మున్సిపాలిటీకి 10 లక్షల రూపాయల విలువైన వైకుంఠరథాన్ని అందజేయగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, మాజి జడ్పిటీసి ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ కొట్టే అశోక్, నాయకులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, నిజానపురం చందు మెద్దసాని రంగన్న పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో వైద్య శిబిరం

జమ్మికుంట, నవంబర్ 25: జమ్మికుంట పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 39మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సంధ్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్, అరుణ, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుప్రియ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్‌ఎమ్ సరళ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చిగురుమామిడి, నవంబర్25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు జేరిపోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని, క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి ఎంత దోహద పడతాయన్నారు, ఈ పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్త కైలాసం, గ్రామస్థులు కొత్త తిరుపతి, జనవేణి అనిల్, సయ్యద్ షరీఫ్, కానవేణి శివకుమార్, కోల జీవన్, జేరిపోతుల ప్రవీణ్, మల్లయ్య, రవీందర్, తిరుపతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మాజీ చైర్మన్ అనిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిట్స్‌లో పుస్తకావిష్కరణ

హుజూరాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు విజ్ఞానాన్ని అందిస్తాయని కిట్స్ కళాశాల సెక్రటరీ, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి మేజర్ రవీంద్రబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘులు రచించిన క్రిప్టోగ్రఫీ అండ్ సైబర్ సెక్యూరిటీ అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అధ్యాపకులు పుస్తకాలను రాయడం వలన విద్యా ర్థులకు అదనపు సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వస్తుందన్నా రు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏవోను సన్మానించిన రైతులు.. ఎరువుల దుకాణాదారులు

హుజూరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఫర్టిలైజర్ అసోసియేషన్, రైతుల ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన మండల వ్యవసాయాధికారి సునీల్ కుమార్‌ను సోమవారం సన్మానించారు. గత 11 సంవత్సరాలుగా హుజూరాబాద్ వ్యవసాయాధికారిగా సునీల్‌కుమార్ పనిచేసి రైతుల మన్ననలను పొందారని రైతులు కొనియాడారు. రైతుల పంటలకు సంబంధించిన వాటిపై ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇచ్చారన్నారు. అనంతరం ఆయనను ఏడీఏ సునీత, ఏవో భూంరెడ్డి, ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు, రైతులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏవో పి గోవర్ధన్‌రెడ్డి, ఎ గోపాల్‌రావు, తూముల చక్రధర్‌రావు, అచ్చ బాలకృష్ణ, తిరుపతిరావు, పున్నంచందర్, ప్రభాకర్‌రావు, అనిల్, రాజేంద్రప్రసాద్, రమేష్, అశోక్, రంజిత్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో సోమవారం తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 105 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు 20 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఎంపిడివో విజయ్‌కుమార్, ఉప తహసీల్దార్ లక్ష్మణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి కింద సత్వరం లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు. సోమవారం 105 మందికి సీఎంఆర్ఎఫ్ కింద 24.85 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదగోని లక్ష్మీనారా యణ గౌడ్, జిల్లా పార్టీ కార్యాలయ ఇంచార్జ్ గోపు మల్లారెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

వీణవంక, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మండ లంలోని చల్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళ సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు శైలజ, కవితలు మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షత చూపరాదని, లింగ నిర్ధారణ పరీక్షలు నిషేదమన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్, ఆశవర్కర్‌లు ఉన్నారు.

మంత్రి పొన్నం పరామర్శ

హుజూరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యకర్త గుర్రం హరిబాబు తండ్రి వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు.

పీఈటీకి సన్మానం

సైదాపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ దినోత్సవం నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు నిర్మలను సన్మానించారు.

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు

హుజూరాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామంలోని కల్వరి టెంపుల్ చర్చిలో పాస్టర్ నెల్సన్ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో సుధిన, ఎలిజబెత్, అరుణ్‌కుమార్, రాజేశ్వరి, రక్షిత పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

రామడుగు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ ఎన్నిక సోమవారం మండల ఇంచార్జి కొత్తూరు రాజయ్య ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షులుగా రామడుగు జగన్, ఉపాధ్యక్షులుగా నాగి జయంత్, ఆరేపల్లి అనిల్, నాగి సూరజ్, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌లు ఎన్నికయ్యారు.

మహిళా కానిస్టేబుల్‌కు సన్మానం

వీణవంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన కుమారి ముత్యాల ప్రవళిక కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాగా సోమవారం మహాకళ వంశస్తులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●హుజూరాబాద్: హుజూరాబాద్‌కు చెందిన గోపాల్‌రావు జిల్లా ఫర్టిలైజర్ డీలర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా, అచ్చ బాలకృష్ణలను జాయింట్ సెక్రటరీగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

●శంకరపట్నం: శంకరపట్నం మోడల్ స్కూల్‌లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నబా మమ్మద్దీ సకుర సైన్స్ ఎక్చేంజ్ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో ఎంపికై జపాన్ సందర్శించి వచ్చారు. జపాన్ పర్యటించి వచ్చిన నబా మహమ్మదీని ఆదర్శ పాఠశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఘనంగా సన్మానించారు.